నిమజ్జనానికి అందరూ సహకరించాలి

● మంత్రి పొన్నం ప్రభాకర్



మానకొండూర్ చెరువు వద్ద కలెక్టర్‌తో చర్చిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ

మానకొండూర్, సెప్టెంబరు 15 : గణేష్ నిమజ్జనానికి ప్రభుత్వం తరుపున అన్ని ఏర్పాట్లు చేశామని, ప్రశాంతమైన వాతావరణంలో నిమజ్జనానికి ప్రజలందరు సహకరించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. మానకొండూర్ చెరువు వద్ద జరిగే నిమజ్జన ఉత్సవాల ఏర్పాట్లను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సోమవారం కరీంనగర్‌లోని విగ్రహాలను మానకొండూర్, కొత్తపల్లి, చింతకుంటలో నిమజ్జనం చేస్తారన్నారు. దీనికి సంబంధించి మున్సిపల్ యంత్రాంగం, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో గణేష్ నిమజ్జన ప్రక్రియ సజావుగా సాగడానికి అన్ని ఏర్పాట్లు చేశారన్నారు. మానకొండూర్ చెరువు కట్టపై జరిగే నిమజ్జనంలో ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. శోభాయాత్ర సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా పోలీసులు నిమజ్జనం జరిగే ప్రదేశంలో లైటింగ్ ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా ప్రభుత్వం గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్‌ను అందించిందన్నారు. అధికారులతో నిర్వహకులు, గణేష్ ఉత్సవ సమితి, వీహెచ్‌పీతో సమన్వయం చేసుకుని పని చేయాలని కోరారు. గణేశుడి ఆశీర్వాదంతో నిమజ్జన కార్యక్రమం విజయవంతం అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో జరిగే నిమజ్జనంపై ఎలాంటి సందేహం లేదని, గతంలో జరిగిన దాని కంటే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అన్ని రకాల ఏర్పాట్లను చేసిందన్నారు. జీహెచ్ఎంసీ, పోలీస్, వాటర్ వర్క్స్, వివిధ శాఖల అధికారుల సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. 17న హైదరాబాద్‌లో సెలవు ఉన్నందున త్వరగా నిమజ్జనం పూర్తి చేయాలని ఆదేశించినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ని దెబ్బ తీసేందుకు ప్రతి పక్షాలు విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. శాంతి భద్రతలకు విఘాతం జరిగితే ఉపేక్షించేది లేదని అలాంటి వారిపై కఠినంగా వ్యవహరించాలని పోలీస్ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. పార్టీ ఫిరాయింపుల విషయం హైకోర్టులో ఉందని, అది శాసన సభ చూసుకుంటుందన్నారు. రాజకీయ విమర్శలు చేసి పోట్లాడుకోవాలనుకుంటే నిమజ్జనం తర్వాత అని అన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కల్గించే ఏ పార్టీనైనా ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు.

నేడు నిమజ్జనోత్సవం



కొత్తపల్లి చెరువు వద్ద ఏర్పాటు చేసిన భారీ క్రేన్

నీటితో కళకళలాడుతున్న మానకొండూర్ చెరువు

చింతకుంటలో ఎస్సారెస్పీ కెనాల్ వద్ద ఏర్పాటు చేసిన భారీ క్రేన్

● పూర్తయిన ఏర్పాట్లు
● టవర్‌సర్కిల్ వద్ద ఉత్సవ సమితి ఆధ్వర్యంలో పూజలు

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 15: విఘ్నేశ్వర నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం నిమజ్జనోత్సవాన్ని నిర్వహించనున్నారు. వచ్చే యేటి వరకు అందరిని చల్లగా చూడమని వేడుకుంటూ భారీ వినాయక ప్రతిమలనుజలాశయాల్లో నిమజ్జనం చేయనున్నారు. ఈసారి విఘ్నేశ్వర ప్రతిమలు ఎక్కువగా నెలకొల్పారు. తొమ్మిది రోజులుగా విశేష పూజలు, అభిషేకాలు, అర్చనలు అందుకున్న గణనాథుల శోభా యాత్ర నగరంలోని అన్ని వీధుల మీదుగా సాగనుంది. యువకులు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు విభిన్న వేషధారణలు, అలంకారాల కోసం దుస్తులను, అలంకరణ సామగ్రిని తెప్పించుకున్నారు. దారి పొడువునా భక్తులకు ప్రసాదాలు పంచడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. వాహనాలను ముస్తాబు చేయడంలో నిమగ్నమయ్యారు. రాత్రి పొద్దు పోయే వరకు సాగనున్న నిమజ్జనోత్సవానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసుకున్నారు. మరో వైపు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో కూడా ఏర్పాటు చేశారు. లైటింగ్, సౌండ్, గజ ఈతగాళ్ళు, క్రేన్‌లు, రోడ్ల మరమ్మతులు వంటి ఏర్పాట్లు చేశారు.

టవర్‌సర్కిల్ వద్ద ..

ప్రతి వినాయకుడు టవర్‌సర్కిల్ వద్ద పూజలు అందుకొని నిమజ్జనో త్సవానికి తరలి వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. హిందూ ఉత్సవ సమితి, వీహెచ్‌పీ ఆధ్వర్యంలో పూజలకు ఏర్పాట్లు చేయగా ఒకటో నెంబర్ వినాయకుడు తొలి పూజలు అందుకోనున్నాడు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక పూజలు చేయనున్నట్లు సమాచారం. మండపాల వద్ద మధ్యాహ్నం 12 గంటల వరకు పూజలు, ఏర్పాట్లు పూర్తి చేసుకుని ఐదు గంటల వరకు టవర్‌సర్కిల్ వరకు వినాయక ప్రతిమలు తరలనున్నాయి. నిమజ్జనానికి చింతకుంట, కొత్తపల్లి, రాయపట్నం, ఇరుకుల్ల జలాశాలయాలతోపాటు మానకొండూర్ చెరువుకు భారీగా గణనాథుని ప్రతిమలు తరలనున్నాయి. మరి కొన్ని చోట్ల ప్రతిష్ఠించిన చోటే నిమజ్జనం జరుపనున్నారు.

పోలీసులు, అధికారులు, ఉత్సవ నిర్వాహకుల సూచనలు

నిమజ్జనోత్సవంలో భాగంగా పోలీసుశాఖ వారు, సంబంధిత అధికారులు, ఆయా ఉత్సవ నిర్వాహకుల సూచనలు పాటిస్తే శోభా యాత్ర సజావుగా సాగుతుంది. ఆయా శాఖల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేయగా ఎలాంటి అవాంఛనీయ సంఘట నలు జరగకుండా ఏర్పాట్లు చేశారు. భారీ స్థాయిలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులు, యువకులు, నిమజ్జ నంలో పాల్గొనే వారు, పిల్లలు యాత్రలో జాగ్రత్తలు పాటిం చాలి. ముఖ్యంగా విద్యుత్ వైర్లు, వాహనాలతో నడిచే సమయంలో జాగ్రత్త వహించాలి. మద్యం తీసుకోక పోవడమే గాకుండా తీసుకున్న వారికి దూరంగా ఉంటే మంచిది. నిమజ్జన సమయంలో లోతు ప్రాంతానికి వెళ్లకుండా ఉండాలి. ఈత వచ్చిన వారే నీటిలో దిగడం మంచిది. పిల్లలు, వృద్ధులు కాస్త దూరంగా ఉండాలి. క్రేన్‌లో నుంచి నీటిలో వేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. జనం మధ్యలో పిల్లలను తీసుకెళ్లాల్సి వస్తే వారి చేతిని పట్టుకొని ఉంటే తప్పిపోకుండా ఉంటారు.



చింతకుంటలో నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీమంత్రి గంగులకమలాకర్

● భగత్‌నగర్: కొత్తపల్లి మండలం చింతకుంటలో గణేష్‌నిమజ్జన ఏర్పాట్లను ఆదివారం మాజీ మంత్రి గంగుల కమలాకర్, నగర మేయర్ సునీల్‌రావు పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, మున్సిపల్ అధికారులు బీఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షుడు చల్లాహరిశంకర్, కొత్తపల్లి మాజీ వైస్‌ఛైర్మన్ భూక్యతిరుపతినాయక్, ఎంఏకరీం పాల్గొన్నారు.

● కొత్తపల్లి, చింతకుంట ఎస్సారెస్పీ కాలువలో సోమవారం నిర్వహించనున్న వినాయక నిమజ్జన ఏర్పాట్లను ఆదివారం కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. నిమజ్జనానికి తరలి వచ్చే ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. మున్సిపల్, రెవెన్యూ, పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. నిమజ్జనానికి తరలి వచ్చే విగ్రహాల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. నిమజ్జనం కోసం తగినంత సిబ్బందిని నియమించాలన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను చెరువులు, కాలువల్లో వేయకుండా ప్రత్యేక స్టోరేజ్ పాయింట్‌నుఏర్పాటు చేయాలన్నారు. మున్సిపల్ సిబ్బందిని నియమించి ఎప్పటికప్పుడు వ్యర్థాలను శుభ్రం చేయాలన్నారు. నిమజ్జనం పాయింట్లలో అత్యవసర చికిత్స కోసం వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. సౌండ్స్ లైట్స్, మంచినీటి వసతి, జనరేటర్ ఏర్పాట్లు చేయాలన్నారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి



మానకొండూర్‌లో అధికారులతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

మానకొండూర్, సెప్టెంబరు 15 :జిల్లాలోని అధికార యంత్రాంగం సమన్వయంతో పని చేసి గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు సూచించారు. మానకొండూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆదివారం గణేష్ నిమజ్జనంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మానకొండూర్ చెరువుకట్టపై సొమవారం జరిగే గణేష్ నిమజ్జన ఉత్సవాలను అందిరి సహకారంతో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా, ఉత్సాహంగా నిమజ్జనంలో భక్తులు, నిర్వాహకులు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. కరీంనగర్‌లోని టవర్ సర్కిల్ వద్ద తొలి వినాయక ఊరేగింపు ఆరు గంటలకు మొదలవుతుందని అన్నారు. రాజకీయాలకు అతీతంగా గణేష్ ఉత్సవాలకు అందరిని ఆహ్వానించి ఉత్సవాల్లో పాల్గొనేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారుల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. వాహనాల పార్కింగ్ కోసం తగిన ఏర్పాట్లు చేసి ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని పోలీసులను ఆదేశించారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ మండల కేంద్రంలో గణేష్ నిమజ్జనం పూర్తయ్యేంత వరకు అధికారులంతా అందుబాటులో ఉండాలని కోరారు. అవసరమైతే షిఫ్టుల వారిగా విధులు నిర్వహించాలని సూచించారు. పోలీస్ సిబ్బందికి సహకరించి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని కోరారు. నిమజ్జనం పూర్తి అయిన వెంటనే చెత్తా చెదారాన్ని పూర్తి స్థాయిలో తొలగించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మికిరణ్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, తహసీల్దార్ రాజేశ్వరీ, ఎంపీడీవో వరలక్ష్మి పాల్గొన్నారు.

'సుప్రీం'ది ఎనిమిది దశాబ్దాల చరిత్ర

● 15 వేలకుపైగా ఉత్పత్తులు
● సుప్రీం ఇండస్ట్రీస్ డీజీఎం జగదీశ్వర్‌రావు



సుప్రీం పైపులైన్ ఇండస్ట్రీ స్టాల్‌ను పరిశీలిస్తున్న వినియోగదారులు, ఇంజనీర్లు

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 15: పీవీసీ పైపుల రంగంలో ఎనిమిది దశాబ్దాల చరిత్ర సుప్రీం పైపులైన్ ఇండస్ట్రీస్‌కు ఉందని ఆ కంపెనీ డీజీఎం జగదీశ్వర్‌రావు అన్నారు. మూడు రోజులుగా కరీంనగర్ వైశ్యభవన్‌లో నిర్వహిస్తున్న బిల్డ్ ఎక్స్‌పో ఆదివారం ముగిసింది. సుప్రీం పైపులైన్ ఇండస్ట్రీ స్టాల్‌ను పలువురు సందర్శించారు. ఈ సందర్భంగా సుప్రీం ఇండస్ట్రీస్ డీజీఎం జగదీష్ మాట్లాడుతూ 15 వేలకు పైగా ఉత్పత్తులను కలిగిన ఏకైక సంస్థగా తమ కంపెనీకి ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోందని అన్నారు. 58 దేశాలకు తమ ఉత్పత్తులను ఎగుమతి చేస్తున్నామని చెప్పారు. ప్రతి రాష్ట్రంలోనూ కంపెనీ తయారీ యూనిట్లతో అత్యధికంగా 30 యూనిట్లు కలిగిన సంస్థగా గుర్తింపు ఉందని తెలిపారు. పీవీసీ రంగంలోనే అత్యధిక టర్నోవర్ కలిగి ఉన్నామన్నారు. తనకు పీవీసీ రంగంలో 24 సంవత్సరాల అనుభవం ఉందని, తనతోపాటు 12 సంవత్సరాల అనుభవం కలిగిన సీనియర్ ఎగ్జిక్యూటివ్ పవన్‌కుమార్ వంటి అనేక మందికి కంపెనీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని తెలిపారు. జిల్లాస్థాయిలో ఇలాంటి బిల్డ్ ఎక్స్‌పోలను ఏర్పా టు చేయడం ద్వారా ప్రజలకు అత్యాధునిక ఉత్పత్తులపై అవగాహన కలుగుతుందన్నారు. ఈ ఎక్స్‌పో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

సీతారాం ఏచూరి ఆశయాలను కొనసాగిస్తాం..



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి

సుభాష్‌నగర్, సెప్టెంబరు 15: ఏచూరి సీతారాం ఆశయాలను కొనసాగిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని ప్రెస్ భవన్‌లో సీతారాం ఏచూరి సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతారాం ఏచూరి మృతి దురదృష్టకరమన్నారు. దేశ రాజకీయాలపై అవగాహన ఏర్పరచుకుని సమ సమాజం కోసం కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. సీతారాం ఏచూరి బతికినంత కాలం పేద ప్రజల కోసమే బతికారని, నమ్ముకున్న సిద్ధాంతానికి కట్టుబడి సీపీఎంను ముందుకు నడిపారన్నారు. సీతారాం ఏచూరి మరణం వామపక్షాల ఉద్యమాలకే కాకుండా భారతదేశ రాజకీయాలకు, పేద ప్రజలకు తీరని లోటని అన్నారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు గీట్ల ముకుందరెడ్డి, గుడికందుల సత్యం, జి భీమాసాహెబ్, జిందం ప్రసాద్ మాట్లాడుతూ సీతారాం ఏచూరి తన మరణం తరువాత కూడా జీవించి ఉండేలా శరీరాన్ని పరిశోధనలకు ఇవ్వడం ఎంతో మందికి ఆదర్శమన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు సుంకరి సంపత్, నరేష్, జిల్లా నాయకులు కోనేటి నాగమణి, జి తిరుపతి, తిప్పారపు సురేష్, వడ్ల రాజు, రాయికంటి శ్రీనివాస్, పుల్లెల మల్లయ్య, గజ్జెల శ్రీకాంత్, కాంపెల్లి అరవింద్, కాల్వ సురేష్, జనగాం రాజమల్లు, రాంమోహన్, నందల సత్యనారాయణ, రాంపెల్లి శ్రీనివాస్, దేవేంద్ర, రోజారాణి, యమున, లావణ్య, బోడ మోహన్, గుండేటి వాసుదేవ్, రాజు పాల్గొన్నారు.

అమర వీరుల త్యాగం చిరస్మరణీయం

● సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

చిగురుమామిడి,సెప్టంబరు 15: ప్రజల కోసం అమరులైన నాయకుల త్యాగాలు చిరస్మరణీయమని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ఇందుర్తి, గునుకులపల్లి, చిగురుమామిడి, గాగిరెడ్డిపల్లి, నవాబుపేట, సుందరగిరి, రేకొండ, రామంచ, ఓగులాపూర్, బొమ్మనపల్లికి చెందిన అమర వీరుల స్థూపాల వద్ద పార్టీ జెండాలను ఆవిష్కరించారు. అమరులకు నివాళుర్పించి ర్యాలీ నిర్వహించినారు. అనంతరం గునుకులపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణా సాయుధ పోరాటం లేకుంటే హైదరాబాద్ మనకు దక్కేది కాదన్నారు. నాటి రజాకార్లను తరిమికొట్టి పేద ప్రజలను వెట్టి చాకిరి నుంచి విముక్తి చేసి 4,500 మంది అమరుల త్యాగ ఫలితమే నేటి హైదారాబాద్ అని అన్నారు. పేద ప్రజలు ఉన్నంతవరకు ఎర్ర జెండా పార్టీలు ఉంటాయన్నారు. పాలక ప్రభుత్వాలు ప్రజా ఉద్యమాలను ఎంత అణిచివేసినా అంతకు రెట్టింపుగా ఎగిసి పడుతాయన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, నాయకులు అందె స్వామి, చాడ శ్రీధర్‌రెడ్డి, బూడిద సదాశివ, కూన లేనిన్, శోబారాణి, చిన్న స్వామి, గూడెం లక్ష్మీ, బోయిని అశోక్, ఉస్మాన్ పాషా, రాకం అంజవ్వ, ముద్రకోల రాజయ్య, శారద, జంపయ్య యాకుబ్ అలీ, ఇల్లందుల రాజయ్య, కాంతల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



ఇందుర్తిలో అమరవీరుల స్థూపం వద్ద పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు



గంగాధర మండలంలో పూర్తిస్థాయిలో ప్రవహిస్తున్న వరద కాలువ

ఉధృతంగా వరద కాలువ

గంగాధర, సెప్టెంబరు 15: గంగాధర మండల పరిధిలో వరద కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. శ్రీరాం సాగర్ ప్రాజెక్టు నుంచి 19 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో వరద కాలువలో నీరు బ్రిడ్జి అంచులను తాకుతూ ప్రవహించింది. మండలంలోని ర్యాలపల్లి, కొండయ్యపల్లి, బూరుగుపల్లి, నాగిరెడ్డిపూర్, కొండన్నపల్లి, రంగరావుపల్లి, తాడిజెర్రి, గర్షకుర్తి, ఆచంపల్లి గ్రామాల్లో వరద కాలువ నిండుగా ప్రవహిస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. భూగర్భ జలాలు పెరిగి సాగు నీటికి ఇబ్బందులు తొలగుతాయని రైతులు అన్నారు.

● నేడు ఎల్ఎండీ నుంచి నీటి విడుదల

తిమ్మాపూర్: దిగువ మానేరు రిజర్వాయర్ (ఎల్ఎండి)లో నీటి నిలవలు పూర్తిస్థాయికి చేరడంతో సోమవారం ఉదయం 9 గంటలకు గేట్లు పైకి ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయనున్నట్లు ఎస్సారెస్పీ ఈఈ పి నాగభూషణరావు ఒక ప్రకటనలో తెలిపారు. డ్యాం నుంచి ఐదు వేల క్యూసెక్కుల నీటిని మానేరు నదిలోకి వదలాలని నిర్ణయించినట్లు తెలిపారు. రెవెన్యూ, పోలీసు అధికారులు జాగ్రత్తలు తీసుకో వాలని, గ్రామాల్లో దండోరా వేయించాలని సూచించారు. ఎల్ఎండీ పూర్తి నీటి సామర్థ్యం 24.034 టీఎంసీలు కాగా ప్రస్తుతం 23.947 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. ఎల్ఎండీ నుంచి ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో 809 క్యూసెక్కులుగా ఉంది.



'నవోదయ'లో కళోత్సవాలు ప్రారంభం

● వివిధ జిల్లాల నుంచి విద్యార్థుల రాక



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపాల్ మంగతాయారు

చొప్పదండి, సెప్టెంబరు 15: జవహర్ నవోదయ విద్యాలయంలో కళోత్సవాలు 2024 ప్రారంభమయ్యాయి. ఉత్సవాలను ప్రిన్సిపాల్ మంగతాయారు, రిటైర్డ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ దాస్యం సేనాధిపతి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. క్లస్టర్ స్థాయిలోని 9 జిల్లాల నవోదయ విద్యాలయాల నుంచి విద్యార్థులు ఈ ఉత్సవాలకు హాజరుకాగా వివిధ పోటీలో పాల్గొన్నారు. ఆదివారం ఆదిలాబాద్, రంగారెడ్డి, మెదక్, వరంగల్ విద్యాలయాల విద్యార్థులు పాటలు, చిత్రలేఖనం, నృత్యం పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా కేబీ శర్మ, కట్ట మంజుల, సత్యనారాయణ, రాధాకృష్ణ వ్యవహరించారు. కాగా ఉత్సవాలు రెండురోజుల పాటు జరుగనున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గల్ఫ్ కుటుంబాలకు ప్రాధాన్యమివ్వాలి

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 15: విదేశాల్లో ఉపాధి పొందుతూ, తెలంగాణ ఖజానాకు ఆదాయం సమకూర్చుతున్న గల్ఫ్ కుటుంబా లకు ప్రభుత్వం అండగా నిలిచి, సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ రాశారు. సుమారు 15లక్షల కుటుంబాలకు పైగా గల్ఫ్ దేశాలలో ఉపాధిని పొందు తున్నారన్నారు. సగటున ఒక్కో కుటుంబానికి నెలకు రూ.10వేల వేతనం పొదుపుగా భావించిన నెలకు రూ.1500 కోట్ల విదేశీమారక ద్రవ్యం సమకూర్చబడుతుందన్నారు. ఇదే లెక్కన ఏడాదికి 18వేల కోట్లు, గడిచిన పదేళ్ల తెలంగాణ పాలనలో సుమారు లక్ష80వేల కోట్ల ఆదాయం చేకూరిందనేది స్పష్టమవు తుందన్నారు. ఇందులో నుంచి ఏ మార్గం ద్వారా ఖర్చు పెట్టిన కనీసం 10శాతం అమ్మకపు పన్నుద్వారా సుమారు 18వేల కోట్లు ఆదాయం గల్ఫ్ కుటుంబాలద్వారా వచ్చిందని భావించక తప్పదన్నారు. ఇంత ఆదాయం రాష్ట్రానికి ఒన గూర్చిపెడుతున్న తెలంగాణ గల్ఫ్ బిడ్డలకు కనీసం ఒక్కపైసా లాభం ఒన గూర్చకపోవడం దురదృష్టకరం అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో గల్ఫ్ దేశాల్లో ఉపాధి పొందుతున్న బిడ్డలు దురదృష్టవశాత్తు గల్ఫ్‌లో మరణిస్తే వారికి కుటుంబాలకు రూ.5లక్షల ఆర్థిక సహాయం అందించడంతో పాటు, విదేశాల నుంచి తిరిగి వచ్చిన కార్మికులకు స్వదేశంలో స్థిరపడేందుకు స్వయం ఉపాధి పథకాల్లో ప్రాధాన్యత, వారి పిల్లలకు గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు ప్రాధాన్యత, గృహవసతి కల్పించడం ప్రభుత్వం బాధ్యతగా భావించాలన్నారు. వీటితో పాటు కేరళ రాష్ట్ర తరహాలో కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటుకు చొరవ చూపాలని కోరారు.


మత్స్యకారుడి వలకు చిక్కిన కొండచిలువ

గన్నేరువరం, సెప్టెంబరు 15 : మండల కేంద్రానికి చెందిన మత్స్యకారుడు రంగనవేణి రాజేశం ఆదివారం లోయర్ మానేరు డ్యాంలో చేపలు పట్టేందుకు వెళ్ళగా అతడు వేసిన వలకు భారీ కొండచిలువ చిక్కింది. వలకు చిక్కిన కొండచిలువ సుమారు మూడు మీటర్ల పొడవు ఉండడంతో తోటి మత్స్యకారుల సాయంతో బయటకు లాగారు. ఒడ్డుకు తీసుకెళ్లిన కొద్దిసేపటికే కొండచిలువ మృతి చెందినట్లు వారు తెలిపారు.





















వస్తోంది.. 'వందేభారత్'



- నాగ్‌పూర్ నుంచి సికింద్రాబాద్‌కు నడవనున్న రైలు
- నేడు నాగ్‌పూర్‌లో ప్రారంభించనున్న ప్రధాని నరేంద్ర మోదీ
- రాష్ట్రంలో రామగుండం, కాజీపేటలో మాత్రమే హాల్టింగ్ సౌకర్యం
- వారంలో మంగళవారం మినహా ఆరు రోజులు నడవనున్న రైలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

దేశంలోనే అత్యంత వేగంగా నడిచే రైలుగా పేరొందిన వందే భారత్ రైలు నాగ్‌పూర్ నుంచి సికింద్రాబాద్ వరకు నడవనున్నది. ఇప్పటివరకు రాష్ట్రంలో వందే భారత్ రైళ్లు విశాఖపట్నం-సికింద్రాబాద్, కాచిగూడ-తిరుపతి మధ్య నడుస్తున్నాయి. నాగ్‌పూర్-సికింద్రాబాద్‌కు నడిచే వందే భారత్ రైలును భారత ప్రధాని నరేంద్ర మోదీ ఈనెల 16వ తేదీన గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో వర్చువల్‌గా సాయంత్రం 4.15 నిమిషాలకు పచ్చజెండా ఊపి ప్రారంభించనున్నారు. దీంతో పాటు అదేరోజు పూణె-హుబ్లీ, కోలాపూర్-పూణె వరకు కూడా మరో రెండు వందేభారత్ రైళ్లను ప్రారంభించనున్నారు. నాగ్‌పూర్ నుంచి సికింద్రాబాద్‌కు నడవనున్న వందే భారత్ రైలుకు తెలంగాణలో పెద్దపల్లి జిల్లా రామగుండంతో పాటు వరంగల్ జిల్లా ఖాజీపేటలో ఆగనున్నది. వారంలో మంగళవారం మినహా అన్ని రోజుల్లో నడవనున్నది. ఈ రైలు 20 కోచులతో గంటకు 130కిలోమీటర్ల వేగంతో ప్రయాణించనున్నది. రామగుండం నుంచి సికింద్రాబాద్‌కు 3 గంటల్లోనే చేరుకోనున్నారు. ఈ రైలును సోమవారం నాగ్‌పూర్‌లో ప్రారంభించిన తర్వాత రాత్రి 19:30 గంటలకు రామగుండం చేరుకోనున్నది. అక్కడ పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్‌సింగ్ స్వాగతం పలకనున్నారు. రెగ్యులర్‌గా ట్రైన్ నంబర్ 20101 నాగ్‌పూర్‌లో ఉదయం 5:43 గంటలకు బయలుదేరనున్నది. సేవగ్రామ్‌కు, 7:03 గంటలకు చంద్రాపూర్‌కు, 7:20 గంటలకు బల్లార్షకు చేరుకుంటుంది. అక్కడి నుంచి రామగుండంకు 9:08 గంటలకు చేరుకుని 9:10 గంటలకు బయలు దేరుతుంది. 10:04 గంటలకు ఖాజీపేటకు, మధ్యాహ్నం 12:15 గంటలకు సికింద్రాబాద్ చేరుకోనున్నది. తిరిగి ట్రెయిన్ నంబర్ 20102 సికింద్రాబాద్‌లో మధ్యాహ్నం 13:00 గంటలకు బయలుదేరి ఖాజీపేటకు 14:18 గంటలకు, రామగుండంకు 15:13 గంటలకు, బల్లార్షాకు 17:25 గంటలకు, చంద్రాపూర్‌కు 17:40 గంటలకు, సేవగ్రామ్‌కు రాత్రి 19:13 గంటలకు, నాగ్‌పూర్‌కు 20:20 గంటలకు చేరుకోనున్నది.

● అక్టోబరు 23 నుంచి వారాంతపు ప్రత్యేక రైళ్లు..

ప్రయాణికుల సౌకర్యార్థం మధ్య రైల్వే జోన్ పూణె డివిజన్ అధికారులు వారాంతపు ప్రత్యేక రైళ్లు(పూణె నుంచి కరీంనగర్ వరకు) నడపనున్నారు. ఈ ప్రత్యేక రైళ్లు వచ్చే నెల 23వ తేదీ నుంచి పూణె రైల్వే స్టేషన్‌నుంచి ప్రారంభం అవుతాయి. ఈ ప్రత్యేక రైళ్లు ఎగువ మార్గంలో 4 ట్రిప్‌లు, దిగువ మార్గంలో 4ట్రిప్‌లు నడుస్తాయి. రైలు సంఖ్య 01451 పూణె నుంచి కరీంనగర్ వారంతపు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు దిగువ మార్గంలో అక్టోబర్ 21, 28, నవంబరు 4, 11 తేదీల్లో సోమవారం రాత్రి 10:45 నిమిషాలకు పూణె రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరి బుధవారం అక్టోబరు 23, 30 నవంబరు 6, 13 తేదీల్లో తెల్లవారు జామున 2:00 గంటలకు కరీంనగర్ రైల్వేస్టేషన్ చేరుకుంటుంది. ఈ రైలు ప్రయాణ సమయం 27గంటల 15 నిమిషాలు, వీటిని 4 ట్రిప్పులు నడపనున్నారు. రైలు సంఖ్య 01452 కరీంనగర్ నుంచి పూణె వారాంతపు ప్రత్యేక ఎక్స్ ప్రెస్ రైలు ఎగువ మార్గంలో అక్టోబర్ 23, 30 నవంబర్ 6, 13వ తేదీల్లో బుధవారం ఉదయం కరీంనగర్ రైల్వే స్టేషన్ నుంచి 6 గంటలకు బయలుదేరి మరుసటిరోజు గురువారం ఉదయం 9:45 గంటలకు అక్టోబరు 24, 31 నవంబరు 7, 14 తేదీల్లో పూణె రైల్వే స్టేషన్ చేరుకుంటుంది. ఈ రైలు ప్రయాణ సమయం 29గంటల 45 నిమిషాలు. అలాగే ఉమ్మడి ఆదిలాబాదు జిల్లాలోని మంచిర్యాల, సిర్పూర్ కాగజ్‌నగర్ ప్రజలకు ఈ రైలుద్వారా ఉదయం ఆదిలాబాదు వెళ్లడానికి ఎంతో ఉపయోగంగా ఉంటుంది. కరీంనగర్-పూణె-కరీంనగర్ ప్రత్యేక వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైలు వలన ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి ఆదిలాబాదు జిల్లా కేంద్రాలు అనుసంధానం కానున్నాయి. ఈ రైలు పెద్దపల్లి జంక్షన్, బల్లార్ష జంక్షన్, మాజ్రీ కాదన్, ఆదిలాబాదు, మూద్ఖేడ్, నాందేడ్, పూర్ణా, పర్భని, ఔరం గాబాద్, మన్మాడ్, అహ్మద్‌నగర్, దౌండ్ మీదుగా నడవనున్నది. ప్రస్తుతం ఉమ్మడి ఆదిలాబాదు జిల్లాలోని మంచిర్యాల, సిర్పూర్ కాగజ్‌నగర్ ప్రజలకు ఆదిలాబాదు వెళ్లడానికి రోడ్డు మార్గం తప్ప రైలు సౌకర్యం అందుబాటులో లేవు. ఈ రైలు అందుబాటులోకి వచ్చిన తరువాత చాలామంది దీనిద్వారా ఆదిలాబాదు ప్రయాణించే వీలుంటుంది. అలాగే ఈ రైలు ఐటీ పరంగా ఎంతో అభివృద్ధి చెందిన పూణె నగరాన్ని ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాదు జిల్లాల ప్రజల్ని అనుసంధానం చేయనున్నది. అలాగే ఈ పూణె వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైలు ద్వారా మహారాష్ట్రలోని ప్రముఖ దేవాలయాలు సందర్శించడానికి వీలుగా ఉంటుంది. చంద్రపూర్ (చాందా) మహంకాళి ఆలయం, కిన్వ ట్ రైల్వేస్టేషన్‌కి దగ్గర్లో ఉన్న మహూర్ శక్తిపీఠం (రేణుకాఎల్లమ్మ) ఆలయం, నాందేడ్‌లోని సిక్కుల పవిత్ర గురుద్వారా, ఔరంగాబాద్ (ఛత్రపతి శంబాజీనగర్)లోని అజంతా, ఎల్లోరా గుహలతో పాటు ప్రముఖ గృశ్నేశ్వర్ జ్యోతిర్లింగం, కోపర్‌గావ్ రైల్వేస్టేషన్ దగ్గర్లోని శిరిడీ సాయిబాబా దేవాలయంతో పాటు పూణెలోని వినాయకుని ఆలయాలు సందర్శించుకునే అవకాశాలున్నాయి. కరీంనగర్ నుంచి పూణె 01452 వారాంతపు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు అక్టోబరు 23, 30 నవంబరు 6, 13వ తేదీల్లో బుధవారం ఉదయం పెద్దపల్లి జంక్షన్ 6:45 గంటలకు వస్తుంది. ఈ రైళ్లకు పెద్దపల్లి జంక్షన్, రామగుండం, మంచిర్యాల, సిర్పూర్‌కాగజ్‌నగర్, ఆదిలాబాదు రైల్వేస్టేషన్‌లలో స్టాప్ సదుపాయం కల్పించారు. పూణెనుంచి వచ్చే టప్పుడు ఈ రైలు పెద్దపల్లి జంక్షన్‌కి బుధవారం రాత్రి 12:08 గంటలకు వస్తుంది. ఈ రైళ్లను సద్వినియోగం చేసుకోవాలని రైల్వే అధికారులు కోరుతున్నారు.

● చార్జీల వివరాలు..

సికింద్రాబాద్ నుంచి నాగ్‌పూర్‌కు నడనున్న వందేభారత్ రైలు నంబర్ 20102లో కోచ్‌లను బట్టి చార్జీలను వసూలు చేయనున్నారు. సికింద్రాబాద్ నుంచి నాగ్‌పూర్ వరకు చైర్‌కార్‌లో రూ.925 (ఆహా రం కలిపి), రూ. 885(ఆహారం లేకుండా), ఎగ్జి క్యూటివ్ క్లాస్‌లో రూ.1510 (ఆహారంతో కలిపి), రూ. 1305 (ఆహారం లేకుండా) చార్జీలు తీసుకోనున్నారు. సికింద్రాబాద్ నుంచి రామగుండంకు చైర్ కార్‌లో రూ.670 (ఆహారం లేకుండా), రూ.865 (ఆహారంతో కలిపి), ఎగ్జిక్యూటివ్‌క్లాస్‌లో రూ. 1510 (ఆహారంతో కలిపి), రూ.1305 (ఆహారం లేకుండా) చార్జీలు తీసుకోనున్నారు. ఈ రైలులు ఎటువంటి రాయితీలు వర్తించవు. వికలాంగుల కోటా, సీనియర్ సిటిజన్‌ల, ఇతరత్రా ఎవరికి కూడా రాయితీలు ఉండవని రైల్వే అధికారులు పేర్కొన్నారు.

ప్రాణం తీసిన అతివేగం

- ద్విచక్ర వాహనాలను ఢీకొన్న ప్రైవేట్ బస్సు
- బైక్‌ని 150 మీటర్ల దూరం ఈడ్చుకెళ్లడంతో.. తాత, మనువరాలు దుర్మరణం
- మనవడి పరిస్థితి విషమం
- అల్లీపూర్, ధర్మపురిలో తీవ్ర విషాదం


నారవేణి శ్రీనిధి (ఫైల్)


బైండ్ల లచ్చన్న (ఫైల్)

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 15 : ఓ ప్రైవేటు బస్సు అతివేగం ఇద్దరి ప్రాణాలను బలిగొంది. ఉత్సాహంగా గణేష్ నిమజ్జన వేడుకలు చూసేందుకు వెళ్తూ తాత, మనుమరాలు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. జగిత్యాలరూరల్ మండలంలోని పొలాసలో ఆదివారం ఘోర రోడ్డుప్రమాదం చోటు చేసుకుంది. జగిత్యాల-ధర్మపురి జాతీయ రహదారిపై జగిత్యాలరూరల్ మండలంలోని పొలాస స్టేజీవద్ద ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఆగిఉన్న ఆర్టీసీ బస్సు ను ఓవర్‌టేక్ చేసే క్రమంలో అతివేగంగా రెండు ద్విచక్ర వా హనాలను ఢీకొట్టింది. ఈఘటనలో రాయికల్ మండ లం అల్లీపూర్‌కు చెందిన బైండ్ల లచ్చన్న (52) ధర్మపురి పట్టణానికి చెందిన నారవేణి శ్రీనిధి (09) అక్కడిక్కడే మృతి చెందారు. జగిత్యాలరూరల్ ఎస్సై సధాకర్ తెలిపిన వివరాల ప్రకారం రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామా నికి చెందిన బైండ్ల లచ్చన్న కూతురు మమత ధర్మపురిలో ఉంటున్నారు. అల్లీపూర్‌లో జరుగుతున్న గణేష్ నిమజ్జన వేడుకలను పిల్లలకు చూపించాలని కూతురి కోరిక మేరకు ధర్మపురి నుంచి అల్లీపూర్‌కు మనుమడు, మనుమరాలును తీసుకొని ద్విచక్రవాహనంపై బయల్దేరారు. మార్గమధ్యలోని జగిత్యాలరూరల్ మండలం పొలాన వద్దకు చేరుకోగానే వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని కొండగట్టు నుంచి ధర్మపురి వైపు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు నంబర్ (టీఎస్ 21 యూడీ 9955) అతి వేగంగా ఓవర్‌టేక్ చేసి బలంగా ఢీకొట్టింది. దీంతో వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని బస్సు 150మీటర్ల మేర ఈడ్చుకెళ్లడంతో శ్రీనిధి, లచ్చన్న అక్కడి కక్కడే మృతి చెందారు. మృతదేహాలు నుజ్జునుజ్జై రహదారిపై చెల్లాచెరుదుగా పడిఉన్నాయి. మల్లి కార్జున్‌కు తీవ్ర గాయాల వడంతో జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇదే ఘటనలో జగిత్యాలరూరల్ మండలం పొలాసకు చెందిన బూర్ల రాజన్న, బద్దెనపల్లి నర్సయ్యలు ప్రయాణిస్తున్న స్కూటీని సైతం బస్సు ఢీకొట్టడంతో తీవ్రగాయాలై జగిత్యాల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సంఘటన స్థలాన్ని డీఎస్పీ రఘుచందర్, రూరల్ సీఐ కృష్ణారెడ్డి, ఎస్సై సధాకర్ పరిశీలించారు. నారవేణి మమత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు.

అతివేగం.. నిర్లక్ష్యం

జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస స్టేజీ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదానికి అతివేగమే కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొండగట్టు వైపు నుంచి ధర్మపురి వైపు అతివేగంగా వస్తున్న ప్రైవేట్ బస్సు పొలాస స్టేజీ వద్ద ఆగిఉన్న ఆర్టీసీ బస్సును ఓవర్ టేక్ చేసే క్రమంలో ధర్మపురి నుంచి జగిత్యాల వైపు వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టడంతో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారని వారు సంఘటన స్థలంలో చర్చించు కున్నారు. కొంత తక్కువ వేగంగా ఉంటే ప్రమాద తీవ్రత తగ్గి ఉండేదని స్థానికులు భావిస్తున్నారు. కుటుంబ సభ్యులు సంఘటన స్థలంలో రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మృతితో రాయికల్ మండలం అల్లీపూర్, ధర్మపురిలో తీవ్రవిషాదం చోటుచేసుకుంది.

శ్రీరాంసాగర్‌కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో



జగిత్యాల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : శ్రీరాం సాగర్ ప్రాజెక్టులోకి ఆదివారం ఇన్‌ఫ్లో కొనసాగింది. ఎస్సారెస్పీలోకి 25,840 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు కలిపి ప్రాజెక్టు నుంచి 25,840 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

క్రైం కార్నర్

వ్యక్తి రిమాండ్

హుజూరాబాద్, సెప్టెంబరు 15: హుజూరాబాద్‌లో ఓ యూట్యూబ్ ఛానల్‌కు చెందిన వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని నర్సింగాపూర్ గ్రామానికి చెందిన పి సమ్మయ్య అనే వ్యక్తి భూపాల్‌పల్లిలో నివాసం ఉంటున్నాడు. జూలై నెలలో హుజూరాబాద్‌కు చెందిన ఓ వ్యాపారిని టి సంపత్ అనే వ్యక్తి డబ్బులు అడిగినట్లు యూట్యూబ్ ఛానల్ వ్యక్తి సమ్మయ్య ఆడియో సోషల్ మీడియాలో వైరల్ చేశాడు. దీంతో సదరు సంపత్ తనకు సంబంధం లేదని, తాను ఎవరిని డబ్బులు అడగలేదని హుజూరాబాద్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేశారు. యూట్యూబ్ ఛానల్‌కు చెందిన సమ్మయ్య అనే వ్యక్తి వేరే వ్యక్తి జగన్‌తో కావా లనే చేశాడని తేలింది. సమ్మయ్యను హుజూరాబాద్ డిపో క్రాస్ వద్ద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి నట్లు తెలిపారు. గతంలో సమ్మయ్యపై భూపాల్‌పల్లిలో రౌడీషీట్‌తో పాటు ఐదు కేసులు ఉన్నట్లు టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు.

జ్వరంతో మహిళ మృతి


లక్ష్మి(ఫైల్)

ముత్తారం, సెప్టెంబరు 15 : పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని పోతారం గ్రామంలో గుజ్జుల లక్ష్మి(52) జ్వరంతో మృతి చెందింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... లక్ష్మి నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. ఆమెను కొడుకు రాజ్‌కుమార్ ఆదివారం 108 అంబులెన్స్‌లో పెద్దపల్లి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందింది. లక్ష్మి భర్త నాలుగేళ్ల క్రితం మృతి చెందగా, తన కొడుకుతో కలిసి పోతారం గ్రామం లో కూలి పని చేసుకుంటూ జీవిస్తోంది.

పోలీసుల పేరు చెప్పి బైక్‌తో ఉడాయింపు

కరీంనగర్‌లో సినీ ఫక్కీలో చోరీ

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 15: పోలీసుల పేరు చెప్పి శనివారం రాత్రి యువకుడి వద్ద ద్విచక్రవాహనం తీసుకుని ఓ దొంగ ఉడాయిం చాడు. బాధితుడు, పోలీసులు తెలిపిన వివ రాల ప్రకారం కరీంనగర్ తిలక్‌రోడ్‌కు చెందిన బొజ్జ శివ బీటెక్ పూర్తి చేసి ఇంటివద్దనే ఉంటు న్నాడు. బొజ్జ శివ శనివారం రాత్రి 8 గంటల ప్రాంతంలో తన రాయల్ ఎన్‌ఫీల్డ్(టీఎస్ 02 ఇఎక్స్ 7852) బైక్‌పై పని కోసం బయటకు వచ్చాడు. శివ శాస్త్రీరోడ్ ఒక మెడికల్ షాపు వద్దకు వచ్చేసరికి ట్రాఫిక్ పోలీసు వేషధారణ లో వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి తాను ట్రాఫిక్ పోలీసునంటూ పరిచయం చేసుకున్నాడు. మా ఎస్‌ఐని తీసుకొని వస్తానని చెప్పి రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ తీసుకెళ్లాడు. ఆ వ్యక్తి ఎంతకీ రాకపోయేసరికి తాను మోసపోయానని శివ గ్రహించాడు. బైక్ కోసం రాత్రంతా వెతికిన శివ ఆదివారం ఒకటో టౌను పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. శాస్త్రిరోడ్‌లోని సీసీ కెమెరాలను క్రైంపార్టీ పోలీసులు పరిశీలించి, నిందితుడి కోసం గాలిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గన్నేరువరం, సెప్టెంబరు 15 : మండలంలోని గుండ్లపల్లి స్టేజీ రాజీవ్ రహదారిపై వెళుతున్న బైకును వెనుక నుంచి కారు ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం కరీంనగర్ నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న టీఎస్ 36జె1895 బైకును వెనక నుంచి టీఎస్ 28జె8868 కారు ఢీకొట్టింది. దీంతో బైక్ మీద ఉన్న ఇద్దరు ఎగిరిపడడంతో ఒకరికి కాలు విరగగా, మరొకరికి భుజానికి గాయం అయింది. స్థానికులు టోల్‌గేట్ అంబులెన్స్‌లో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తులు హుజూరాబాద్ మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన ఉమాపతిరెడ్డి, సుభాష్ రెడ్డిగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.


మిడ్ మానేరు ప్రాజెక్ట్

నిండుకుండలా మిడ్ మానేరు

బోయినపల్లి, సెప్టెంబరు 14: శ్రీరాజరాజేశ్వర జలాశయం (మిడ్ మానేరు) నిండు కుండలా మారింది. మేడిగడ్డ ప్రాజెక్టు నుంచి ఎత్తిపోతలు లేకపోవడంతో ఈ ఏడాది మిడ్ మానేరు పూర్తిస్థాయిలో నిండుతుందా? అనే సందేహం తలెత్తింది. అయితే ఎల్లంపల్లి, ఎస్సారెస్పీ నుంచి వరద నీరు వచ్చి చేరడంతో జలకళను సంతరించుకుంది. ఈ ఏడాది జూన్ 1 నుంచి ఆదివారం ఉదయం వరకు మిడ్ మానేరులోకి 48.859 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా ఇందులో శ్రీపాద ఎల్లంపల్లి ఎత్తిపోతల ద్వారా 23.978 టీఎంసీలు, ఎస్సారెస్పీ నుంచి 12.376, ప్రాజెక్టు ఎగువ భాగాన కురిసిన వర్షాలతో మానేరు, ములవాగు ద్వారా 12505 టీఎంసీల వరద నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరింది. మిడ్ మానేరు నుంచి ఎల్ఎండీ ప్రాజెక్టుకు 10.127 టీఎంసీలు, ప్యాకేజీ 10లోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 17.534 టీఎంసీలు కుడి కాలువకు 0.079 మిషన్ భగీరథక, నీటి ఆవిరి కింద 0.813 టీఎంసీలు తరలివెళ్లాయి. దీంతో మిడ్ మానేరుపై ఆధారపడిన ప్రాజెక్టులకు నీటి కష్టాలు తప్పడంతో ప్రాజెక్టుపై ఆధారపడిన పంట భూములకు వానాకాలం, యాసంగి సాగుకు ఢోకా లేకుండా పోయింది. మిడ్ మానేరు పూర్తి స్థాయి నీటి మట్టం 318. మీటర్లకు ప్రస్తుతం 317.47కు చేరుకుంది. నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు 26.19 టీఎంసీలకు చేరుకుంది.

ధర్మగుండంలో గణపయ్య నిమజ్జనం


ధర్మగుండంలో వినాయకుడిని నిమజ్జనం చేస్తున్న అర్చకులు, సిబ్బంది

వేములవాడ, సెప్టెంబరు 15 : గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో తొమ్మిది రోజులపాటు ప్రత్యేక పూజలు అందుకున్న ఆది దేవుడు విఘ్నేశ్వరుడి నిమజ్జనోత్సవం ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల కోసం రాజన్న ఆలయ ఆవరణలోని నాగిరెడ్డి మండపంలో ప్రతిష్ఠించిన విఘ్నేశ్వరుడికి ఆలయ అర్చకులు ప్రతీరోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేకపూజలు చేశారు. చివరి రోజైన ఆదివారం ఉదయం ఆలయ అర్చకులు, వేద పండితులు హవనము నిర్వహించి పూర్ణాహుతి, రాత్రి ప్రత్యేక పూజల తదుపరి పట్టణ వీధుల మీదుగా గణేశుడి శోభాయాత్ర కన్నుల పండు వగా నిర్వహించారు. ధర్మగుండంలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వినోద్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, ఆలయ అధికారులు, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ

పట్టపగలే ఇంట్లోకి దూరి దొంగతనం

తంగళ్లపల్లి, సెప్టెంబరు 15 : తంగళ్లపల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఆదివారం ఓ దుండగుడు పట్టపగలే ఇంట్లోకి దూరి వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గొలుసు ఎత్తుకెళ్లాడు. బాధితురాలి వివరాల ప్రకారం.. తంగళ్లపల్లికి చెందిన సబ్బని రుక్కుమ్‌బాయి అనే వృద్ధురాలు ఆదివారం ఉదయం ఇంట్లో వంట చేసుకుంటోంది. దుండగుడు ఇంట్లోకి దూరి ఒంటిపై ఉన్న బంగారు గొలుసు లాక్కొని పరారయ్యాడు. వృద్ధురాలు అరుస్తూ ఇంటి బయటకు రాగా పక్కనే వినాయక మండపం వద్ద ఉన్న యువకులు అక్కడికి చేరుకున్నారు. అప్పటికే దొంగ ద్విచక్ర వాహనంపై పారిపోయినట్లు స్థానికులు తెలిపారు. సుమారు రెండున్నర తులాల బంగారు గొలుసు ఎత్తుకెళ్లి నట్లు బాధితురాలు తెలిపింది. రుక్కుమ్‌బాయి భర్త, కుమారుడు మృతి చెందగా ఒక్కతే ఉంటోంది. ఇది గమనించి పథకం ప్రకారం ఇంట్లోకి దూరి గొలుసు ఎత్తుకెళ్లినట్లు స్థానికులు భావిస్తున్నారు. ఎస్సై సుధాకర్ బాధితురాలి నుంచి వివరాలు సేకరించారు. పట్టపగలు చోరీ జరగడంతో పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నారు. డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, దొంగ కోసం గాలిస్తున్నామని తెలిపారు.


బాధితురాలు సబ్బని రుక్కుమ్ బాయితో మాట్లాడుతున్న పోలీసులు

వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 15: వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన ఆదివారం పెద్దపల్లిలో చోటు చేసుకుంది. శాంతినగర్‌కు చెందిన మోహన్‌రెడ్డి(58) ఉదయం వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్తుండగా గోదావరిఖని నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న కోళ్లవ్యాన్ ఢీకొట్టింది. మోహన్‌రెడ్డికి తీవ్రగాయాలు కాగా, పెద్దపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందాడు. భార్య శివపార్వతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. యాక్సిడెంటు చేసిన డ్రైవర్ గోలి రతన్ పోలీసులకు లొంగిపోయాడు.

పురుగుల మందు తాగి..

జూలపల్లి, సెప్టెంబరు 15 : మండల కేంద్రానికి చెందిన కల్లెం తిరుపతిరెడ్డి(45) జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆదివారం మృతి చెందినట్లు ఎస్‌ఐ శ్రీధర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. తిరుపతిరెడ్డికి పిల్లలు లేరు. రెండేళ్ల క్రితం భార్య అనారోగ్యంతో మృతిచెందింది. అప్పటి నుంచి ఆయన మానసికంగా కృంగిపోయి పిచ్చిగా ప్రవర్తించేవాడని, ఈక్రమంలో మృతుడి తండ్రి రాజిరెడ్డికి ఆరోగ్యం బాగా లేకపోవడంతో తల్లి కరీంనగర్ ఆసు పత్రికి తీసుకపోయి వైద్యం కోసం అక్కడనే ఉంటున్నారు. దీంతో జూలపల్లిలో ఇంటివద్ద ఒంటరిగా ఉన్న తిరుపతిరెడ్డి జీవితంపై విరక్తిచెంది పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసున్నాడు. మృతుడి తల్లి నర్సమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సమస్యల వలయంలో గుండ్లపల్లి గురుకుల పాఠశాల



గుండ్లపల్లిలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాల

గన్నేరువరం, సెప్టెంబరు 15: మండలంలోని గుండ్లపల్లి స్టేజీ వద్ద నిర్వహిస్తున్న మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో అసౌకర్యాలు వెక్కిరిస్తున్నాయి. పాఠశాలలకు వరుస సెలవులు ఇవ్వడంతో విద్యార్థినులను ఇంటికి తీసుకెళ్లేందుకు తల్లిదండ్రులు ఆదివారం హాస్టల్‌కు వచ్చారు. హాస్టల్లో విద్యార్థినులు పడుతున్న అవస్థలను పరిశీలించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ హాస్టల్ ఆవరణలో మురుగు నీరు నిల్వ ఉండడంతో దుర్గంధం వెదజల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బాత్‌రూములకు డోర్లు కూడా ఊడిపోయి కనిపించడంతో హాస్టల్ నిర్వహణపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్‌తో సహా ఏ ఒక్క టీచరు హాస్టల్‌లో లేరన్నారు. ప్రిన్సిపాల్, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పాఠశాల గేటు ఎదుట నిరసన వ్యక్తం చేశారు.

హాస్టల్‌ను మానకొండూరుకు మారుస్తాం

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

గుండ్లపల్లి స్టేజీ వద్ద కొనసాగుతున్న మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలను ఇటీవల స్వయంగా తనిఖీ చేశాను. హాస్టల్‌లోని విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నాను. హాస్టల్‌లో ప్రధానంగా మురుగు నీటి సమస్య ఉందని గుర్తించి ప్రిన్సిపాల్‌ను వివరణ కోరాను. మురుగునీరు బయటకు వెళ్లే మార్గం లేదని, హాస్టల్ భవనం అసౌకర్యంగా ఉందని తెలిపారు. బిల్డింగ్ యజమానితో ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని తెలపారు. దీంతో హాస్టల్‌ను మానకొండూరుకు తరలించేందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లాను. త్వరలోనే మానకొండూరులోని జూనియర్ కాలేజీకి హాస్టల్‌ను మారుస్తాము.

ఎస్ఆర్‌లో డాక్టర్ ముత్యంకు ఘన నివాళి



ముత్యంకు నివాళులర్పిస్తున్న సాహితీవేత్తలు, కవులు, కళాకారులు

గణేశ్‌నగర్, సెప్టెంబరు 15: శాతవాహన విశ్వవిద్యాలయంలోని తెలుగు విభాగం ప్రస్తుత, పూర్వ విద్యార్థులు సంయుక్తంగా ఆర్ట్స్ కళాశాల సెమినార్ హాల్‌లో ఆదివారం ముత్యం సంస్మరణ సభలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురు సాహితి వేత్తలు, కవులు, కళాకరులు నాయకులు ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా తెలుగు విభాగాధిపతి డాక్టర్ మహమ్మద్ జాఫర్ మాట్లాడుతూ ముత్యం ఒక మంచి అధ్యాపకుడని కీర్తించారు. మాజీ రిజిస్ట్రార్ ఆచార్య వినాయకరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల మధ్య వారిధిగా ఉండే ముత్యం చాలా అరుదైన వ్యక్తి అని కొనియాడారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ నలిమెల భాస్కర్ మాట్లాడుతూ ముత్యం ఒక అరుదైన పరిశోధకులని అన్నారు. మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ మాట్లాడుతూ ఒక చక్కని ఆణిముత్యాన్ని శాతవాహన విశ్వవిద్యాలయం, తెలుగు విభాగం కోల్పోయిందన్నారు.

ముఖ్య అతిథి శాతవాహన విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వరప్రసాద్ మాట్లాడుతూ డాక్టర్ ముత్యం గొప్ప పరిశోధకుడని అన్నారు. పూర్వ విద్యార్థులు ఆయనతో గడిపిన మధుర క్షణాలు నెమరువేసుకున్నారు. విద్యార్థులు, పరిశోధకులు కలిసి ఆయనపై రాసిన వ్యాస సంపుటి పరిశోధనా ముత్యం-మట్టి మనసుల కుంచె అనే పుస్తకం ఆవిష్కరించారు. ముత్యం శిష్యుడైన చెన్నమల్ల చైతన్య మాట్లాడుతూ తెలుగు విభాగ పూర్వ విద్యార్థుల తరపున ముత్యం సార్ పేరు గోల్డ్ మెడల్ స్నాతకోత్సవంలో ప్రకటిస్తూ ప్రతి సంవత్సరం ఆయన పేరుమీద సెమినార్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో తుల రాజేందర్, శాతవాహన ఉప రిజిస్ట్రార్ వై.కిషోర్, ముత్యం మిత్రుడు ప్రభాకర్‌రెడ్డి, సహధ్యాపకుడు శాతవాహన జాతీయ సేవా పథకం సమన్వయకర్త డాక్టర్ మనోహర్, నాగభూషణం, అన్నవరం దేవేందర్, తెలుగు విభాగ అధ్యాపకులు డాక్టర్ లక్ష్మీనారాయణ, కరీంనగర్ జేఏసీ చైర్మన్ బండి చంద్రశేఖర్, ఎస్సార్ అధ్యాపకులు బూర్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడి ప్రమాణ స్వీకారానికి హాజరైన వెలిచాల

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 15: హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆదివారం జరిగిన పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా పీసీసీ ప్రసిడెంట్‌గా ప్రమాణ స్వీకారం అనంతరం ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఓటరు ముసాయిదా జాబితాలో తప్పులు

-కనిపించని కొత్త ఓటర్ల పేర్లు

-గ్రామ పంచాయతీల్లో జాబితా ప్రదర్శన

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 15: ఓటరు ముసాయిదా జాబితాలో తప్పులు దొర్లాయని పలు గ్రామాల ఓటర్లు ఆరోపిస్తున్నారు. ఓటరు ముసాయిదా జాబితాను సిద్ధం చేసి ఈనెల 13వ తేదిన వార్డుల వారిగా గ్రామ పంచాయతీల్లో ఓటరు జాబితాను ప్రద ర్శించారు. అయితే ఈ జాబితాను గత అసెంబ్లీ ఎన్నికల ఓటర్ల జాబితా ఆధారంగా తీసుకోగా ఇందులో కొత్త ఓటర్ల జాబితా ఇందులో లేకపోవడంతో యువ ఓటర్లు మండిపడుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మొదటి ఓటు హక్కు వినియోగించుకున్న తమ పేర్లు రాలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కరీంనగర్ మండలంలో మొత్తం 17 గ్రామ పంచాయతీలు ఉండగా 170 వార్డులు ఉన్నాయి. మొత్తం 40,144 మంది ఓటర్లు ఉండగా, 19,670 పురుష ఓటర్లు, 20,488 మహిళలు, థర్డ్‌జెండర్‌లు ఒక్కరూ ఉన్నారు.

ఒక కుటుంబలోని ఓటర్లందరిని ఒకే వార్డులో చేర్చాలనే ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కార్యదర్శులు ఆమేరకు వార్డుల జాబితాను తయారు చేశారు. గతంలో ఒకే కుటుంబంలోని ఓటర్లు వేర్వేరు వార్డుల్లో ఉండటంతో ఇబ్బందులు తలెత్తడంతో కొత్తగా ఎన్నికల కమీషన్ ఈ నిర్ణయం తీసుకుంది. కాగా ఈ జాబితాలో కూడా నూతన ఓటరు జాబితా రాక పోగా ఉన్న ఓటర్లు ఓ ప్రాంతానికి బదులు మరో ప్రాంతాల్లో ఓటరు జాబితాలో పేర్లు వచ్చాయని ఆరోపిస్తున్నారు. అసెంబ్లీ నియోజకవర్గ ఓటరు జాబితా ఆధారంగా ఈ ప్రక్రియను కొనసాగించామన్నారు. పార్లమెంట్ ఓటర్ జాబితాలో కొత్త యువ ఓటర్లు జాబిత ఉండగా ప్రస్తుతం అసెంబ్లీ నియోజకవర్గ ఓటరు జాబితా ద్వారా వార్డుల ఓటరు జాబితాను రూపొందించామని అధికారులు తెలిపారు. ఈనెల అభిప్రాయ సేకరణతో పాటు అభ్యంతరాలు ఉంటాయని ఈనెల 28వ తేది వరకు ఇంకో అడిషనల్ ఓటరు జాబితా వస్తుందని, దాని ద్వారా ప్రతి ఓటరు ఒకే వార్డులో ఒకే కుటుంబంలో నమోదు అవుతాయని అధికారులు తెలిపారు.

బీజేపీ సభ్యత్వ నమోదు



లక్ష్మాజిపల్లిలో సభ్యత్వ నమోదు పత్రాన్ని అందజేస్తున్న గంగాడి కృష్ణారెడ్డి

హుజూరాబాద్‌రూరల్/ఇల్లందకుంట/వీణవంక/సెప్టెంబరు 15: పలు మండలాల్లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. హుజూరాబాద్ మండలం చెల్పూర్, ఇల్లందకుంట మండలం లక్ష్మాజిపల్లి, వీణవంకలో జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పాల్గొని మాట్లాడారు. ప్రతీకార్యకర్త గడపగడపకు కేంద్ర ప్రభుత్వ పథకాలకు తెలియజేసి సభ్యత్వ నమోదు చేయించాలన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు రాముల కుమార్, మండల కన్వీనర్ ముప్పు మహేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి, జిల్లా కార్యదర్శి బింగి కరుణాకర్, అసెంబ్లీ కన్వీనర్ మాడ గౌతమ్‌రెడ్డి, మండల ఇన్‌చార్జి జెల్ల సుధాకర్, శ్రీరామ్‌శ్యామ్, ఇల్లందకుంట మండలాధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి, పుప్పాల రఘు, రామిడి ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చొప్పదండి: మండలంలోని ఆర్నకొండలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ ప్రారంభించారు. మండల అధ్యక్షుడు మావురం సుదర్శన్‌రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లిలో బీజేపీ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి హాజరై మాట్లాడారు. మండలంలో జరుగుతున్న బీజేపీ పార్టీ సభ్యత్వం నమోదుపై వివరాలు అడిగి తెలుసు కున్నారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పార్టీ కార్యకర్తలు ఉద్యమాలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మామిడి రమేష్, బుజ్జన్న, దరిపెల్లి రమేష్, వేణు, రంజిత్, అంజనేయులు, నాగరాజు, ఓర్సు రాజు పాల్గొన్నారు.

రైతాంగ సాయుధ పోరాటానికి ప్రత్యేక గుర్తింపు



నినాదాలు చేస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, తదితరులు

తిమ్మాపూర్, సెప్టెంబరు 15: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి ప్రపంచ చరిత్రలోనే ప్రత్యేక గుర్తింపు ఉందని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా సాయుధ పోరాట వీరుడు అనబేరి ప్రభాకర్‌రావు సొంత గ్రామం పోలంపల్లిలో మండల కార్యదర్శి బోయిని తిరుపతి ఆధ్వర్యంలో అనబేరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనబేరి మరణించిన రోజు సెప్టెంబరు 17వ తేదీన హుస్నాబాద్ పరిధిలోని మహమ్మదాపూర్‌లోగల అనబేరి సమాధి వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, కంతల తిరుపతి రెడ్డి, కొమురయ్య, రమేష్, రాధా కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇంజనీర్స్ డే వేడుకలు



ఇంజనీర్లను సన్మానిస్తున్న అలయన్స్ క్లబ్, అచీవర్స్ పాఠశాల యాజమాన్యం

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 16: పంచాయతీ రాజ్ ఇంజనీర్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లాశాఖ ఆధ్వ ర్యంలో ఆదివారం ఇంజనీర్స్ డేను ఘనంగా జరుపు కున్నారు. జడ్పీ ఆవరణలోని సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూల మాల వేసి ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ రీజియన్ పీఆర్ ఎస్ఈ కె.లచ్చయ్య, డీపీఆర్ఈ ఆర్.చంద్రశేఖర్, రిటైర్డు సీఈ తులసీదాస్, రాష్ట్ర అసోసి యేట్ ప్రెసిడెంట్ కె.విష్ణువర్ధన్, డీఈలు టి.చిన్నయ్య, జనార్ధన్, రాజేంద్రప్రసాద్, రవి ప్రసాద్, చలపతి, రాజేశ్వర,శారద, మంజుల భార్గవి, మంగ, మదన్, ఆశయ్య, రవి, మల్లికార్జున్ పాల్గొన్నారు.

● నగరంలోని అచీవర్స్ పాఠశాలలో అసోసియేషన్ ఆఫ్ అలయన్స్‌క్లబ్, అచీవర్స్ పాఠశాల సంయుక్త ఆధ్వర్యంలో ఇంజనీర్స్‌డే జరుపుకున్నారు. ఈ సంద ర్భంగా ఇంజనీర్లు కోల అన్నారెడ్డి, కుమారస్వామి, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, గాంధీలను సన్మానించారు. ఈకార్యక్రమంలో క్లబ్ డైరెక్టర్ ఎలగందుల శ్రీనివాస్, గాలిపల్లి నాగేశ్వర్, పలువురు క్లబ్ ప్రతినిధులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

●గణేశ్‌నగర్: దేశ అభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర చాలా కీలకమైందని మానేరు లయన్స్ క్లబ్ సభ్యులు అన్నారు. ఆదివారం ఇంజనీర్లు కొలుపుల రాజు ఏడిఈ కరీంనగర్ రూరల్, దేవసాని సంపత్ కుమార్‌ఏఈ, సంది సంపత్ కుమార్ ఏఈ, అందె చంద్రయ్య ఏఈ, కట్ట నిఖిల్ సబ్ ఇంజనీర్, కే.పండరి సబ్ ఇంజనీర్లను మానేరు లయన్స్ క్లబ్ వారు విద్యుత్ శాఖ ఇంజనీర్లను సన్మానించారు. కార్యక్రమంలో పాస్ట్ గవర్నర్ కోదండరాం, వెంకట్, విష్ణుమూర్తి, మానేరు క్లబ్ జనరల్ సెక్రెటరీ ముత్యం శంకర్ గౌడ్, ప్రవీణ్, రమేష్, కృష్ణ మరియు విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

●సుభాష్‌నగర్: మంకమ్మతోట లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఇంజనీర్లను సన్మానించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని ఆదివారం స్థానిక మంకమ్మతోటలోగల ఎంఆర్ వైశ్యభవన్‌లో మంకమ్మతోట లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఇంజనీర్లు, ఆర్కిటెక్చర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు బూర్ల విద్యాసాగర్, కార్యదర్శి అంబటి రవీందర్‌రాజు, కోశాధికారి పాత విశ్వనాథం, జెడ్‌సీ పవనసుతరాజు, పాత శేఖర్, గుండోజు లక్ష్మయ్య, పాత గంగాధర్, జిల్లా అంజయ్య వాసరయ్య, వెంకటేశం పాల్గొన్నారు.

●వాగ్దేవి వనితక్లబ్ ఆధ్వర్యంలో నగరంలోని ఫిల్మ్‌భవన్‌లో పలువురు ఇంజనీ్లను సన్మానించారు. కార్యక్రమంలో వాసవిక్లబ్ రీజినల్ చైర్మన్ అక్కెనపల్లి నాగరాజు, క్లబ్ అధ్యక్షురాలు మాడిశెట్టి ఉమాదేవి, సంయుక్త కార్యదర్శి హరిణి, మాడిశెట్టి గోపాల్ పాల్గొన్నారు.

విశ్వకర్మ భగవానుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబర్ 15: నగరంలోని కమాన్ చౌరస్తాలో గల పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో ఆదివారం విశ్వకర్మ భగవానుని బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం పతాకావిష్కరణ, బైక్‌ర్యాలీ, పుణ్యాహవాచనం, అంకురారోపణ, అగ్నిప్రతిష్ఠ జరుగగా మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం గాయత్రీదేవి సామూహిక కుంకుమార్చన, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గొల్లపల్లి శ్రీనివాస్, ధర్మకర్తలు శ్రీరామోజు నాగరాజు, వేములవాడ రవీంద్రాచారి, మియాపురం వీరబ్రహ్మాచారి, అనసూరి రమేశ్, ముత్తోజు రామ్‌కుమార్, అస్తాపురం లీల, ఈఓ వుడుతల వెంకన్న, భక్తులు పాల్గొన్నారు. సోమవారం ఉదయం మనుమయాది పంచబ్రహ్మలు, గాయత్రీ విశ్వకర్మ హవనం, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అల్పాహారం ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 15: జిల్లా కేంద్రంలోని డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించిన కరాటే పోటీల్లో జిల్లా కేంద్రానికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఆరవ తరగతి చదువుతున్న ఎన్ ప్రతీక్ మొదటి బహుమతి పొందగా, ఎనిమిదవ తరగతి చదువుతున్న పి అశ్విత్‌కుమార్ మూడవ స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ వసంత్‌కుమార్ వారికి మెడల్స్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ వెంకటేశ్వర్‌రావు, కరస్పాండెంట్ హరిచరణ్‌రావు, మేనేజింగ్ డైరెక్టర్ మౌనిక వారిని అభినందించారు.

జిట్టా బాలకృష్ణారెడ్డికి నివాళి

గణేశ్‌నగర్, సెప్టెంబరు 15: యువజన సంఘాల సమితి, వ్యవస్థాపకులు జాతీయ యువజన అవార్డు గ్రహీత, తెలంగాణ ఉద్యమకారుడు జిట్టా బాలకృష్ణారెడ్డికి ఆదివారం కరీంనగర్ జిల్లా యువజన సంఘాల సమితి ప్రతినిధులు నివాళులర్పించారు. జిట్టా బాలక్రిష్ణారెడ్డి కుటుంబ సభ్యులు, అభిమానులు యాదాద్రి భువనగిరి జిల్లాలోని భువనగిరి పట్టణంలో శ్రీ సాయి కన్వెన్షన్ హాల్ లోసంస్మరణ దశదినకర్మ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కరీంనగర్ జిల్లా యువజన సంఘాల సమితి ప్రతినిధులు ఏ. కిరణ్ కుమార్, రేండ్ల కళింగశేఖర్, అలువాల విష్ణు, తెలంగాణా ప్రైవేట్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి రాజేశ్వర్ యువజన సంఘాల సమితి బాధ్యులు గడ్డం జగత్ పాల్, కోట మధు పాల్గొని వారి చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు.

విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 15: విఘ్నేశ్వర నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పలు మండపాలు, ఆలయాల్లో వివిధ పూజలను ఘనంగా నిర్వహించారు. గణేశ్ నగర్, విద్యానగర్, సూర్యనగర్ మండపాల్లో నిర్వహించిన, పూజలు, పల్లకీ సేవల్లో అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు. 33వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపంతో పాటు, భగత్‌నగర్ వెల్ఫేర్ అసోసియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని వద్ద, బాలరక్షాసదన్ వద్ద గల వినాయకుని వద్ద, 13వ డివిజన్ జానకీరామ్ స్ట్రీట్‌లో ఏర్పాటు చేసిన వినాయకుని వద్ద మేయర్ పూజలు జరిపి అన్నదానంలో పాల్గొన్నారు. రాంనగర్ రమా సత్యనారాయణస్వామి ఆలయంలో గణపతి వద్ద డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి హరిశంకర్ అన్నదానంలో పాల్గొన్నారు.

●భగత్‌నగర్: నగరంలోని జ్యోతినగర్ వినాయకుని వద్ద సరస్వతి పూజ నిర్వహించారు. బీజేపీ సీనియర్ నాయకులు పొల్సాని సుగుణాకర్ రావు పద్మ దంపతులు పిల్లలకు పెన్నులు బుక్కులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో పిట్టల మధుసూదన్, రుద్ర లక్ష్మణ్, కట్ల ఆగయ్య పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు15: కొత్తపల్లి మండలం చింతకుంటలోని ఎస్ఆర్ఎస్‌పీ కెనాల్ వద్ద గణేష్ నిమజ్జన ఏర్పాట్లను సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి పరిశీలించారు. నిమజ్జనానికి వచ్చిన వాహనాలను త్వరితగతిన పంపే విధంగా క్రేన్లు పెంచాలని మైనింగ్ ఏడీకి సూచించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ శ్రీనివాస్, మున్సిపల్ డీఈ గంగాధర్ పాల్గొన్నారు.

●భగత్‌నగర్: చింతకుంట, కొత్తపల్లిలో గణేష్ నిమజ్జన ఏర్పాట్లను వీహెచ్‌పీ, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు రాధకృష్ణరెడ్డి ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధి లైట్లు ఏర్పాటు చేయాలన్నారు.

'అణగారిన వర్గాల ఆశాజ్యోతి చొక్కారావు'



చొక్కారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 15: అణగారిన వర్గాల ఆశాజ్యోతి పొల్సాని చొక్కారావు అని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా కరీంనగర్ రూరల్ మండలం చామనపల్లి గ్రామంలో సీపీఐ ఆధ్వర్యంలో చొక్కారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొట్ట మొదట ఇందుర్తి ఎమ్మెల్యేగా పనిచేసిన చొక్కారావు ఆంధ్ర దోపిడి వ్యవస్థకు, పాలకులకు వ్యతిరేకంగా పోరాటం చేసిన యోధుడని కొనియాడారు. హైదరాబాద్ రాష్ట్రంపై అప్పటి దేశం ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ పోలీస్ చర్య పేరుతో భారత సైన్యాన్ని పంపి విలీనం చేశారని గుర్తు చేశారు. తెలంగాణ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టుల ఆనవాళ్లు లేకుండా చేయడానికి ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద విధానాలపై పోరాటాల ఉధృతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సీపీఐ జిల్లా నియోజక వర్గ ఇంచార్జి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, కరీంనగర్ మండల కార్యదర్శి సాయివేణి రాయమల్లు, కౌన్సిల్ సభ్యులు నలువాల సదానాందం, బోనగిరి మహేందర్, మండల కౌన్సిల్ సభ్యులు మెరుగు కొమురయ్య, దొమ్మాటి నాంపల్లి పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనం చేసేదెలా?

● గ్రామాల్లో కానరాని ఏర్పాట్లు



కాట్రపల్లిలోని చెరువు కట్టపై ప్రమాదకరంగా ఉన్న పగళ్లు

హుజూరాబాద్‌రూరల్, సెప్టెంబరు 15: మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాట్లు చేయకపోవడంతో వినాయక నిమజ్జనం ఎలా చేయాలని ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండి వేడకలను ప్రశాంతంగా జరిపించాల్సి ఉండగా అధికార యంత్రాంగం పట్టిపట్టన ట్లుగా వ్యవహస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నా యి.

● నిండుకుండలా ఉన్న చెరువులు..

ఇటీవల కురిసిన వానలతో ఆయా గ్రామాల్లో చెరువులు, కుంటలు నిండుకుండలా మారాయి. గణేష్ నిమజ్జన వేడుకల వేళ గణనాథులను చెరువుల్లో, కుంటల్లో నిమజ్జనం చేసేందుకు గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు సిద్ధమవుతుండగా, చెరువులకు వెళ్లే రహదారులు బురదమయంగా మారాయి. చెరువుల సమీపంలో పిచ్చి చెట్లు ఏపుగా పెరగడంతో పాటు చెరువు పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. దీనికి తోడు కొన్ని చెరువు కట్టలపై ఇటీవల కురిసిన వర్షాలకు బీటలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. నిమజ్జనం వేళ చెరువుల వద్ద లైటింగ్ సదుపాయం, క్రేన్ ఏర్పాటు చేయడంతో పాటుగా, చెరువు సమీపంలోకి ఎవరూ వెళ్లకుండా రక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ప్రమాదకరంగా మారిన చెరువులు, కుంటల వద్ద గణనాథుడి నిమజ్జన వేళ ఎలాంటి ఏర్పాట్లు జరగకపోవడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో సర్పంచ్‌ల పదవీ కాలం ముగయడంతో ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమైంది. గణనాథుల నిమజ్జనం వేళ ఏర్పాట్లు చేయాల్సిన ప్రత్యేకాధికారులు అసలు ఊసే ఎత్తడం లేదని ఉత్సవ కమిటీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● ఏర్పాట్లు చేయకపోతే ఎలా?

- జోంగోని రణధీర్‌గౌడ్, భజరంగ్‌దళ్ యూత్, జూపాక



గ్రామంలోకి వచ్చే ప్రధాన రహదారి పక్కన ఉన్న కల్వర్టు వద్ద నిమజ్జనం చేద్దామంటే ఇబ్బందిగా ఉంది. క్రేన్ లేకపోతే నిమజ్జనం ఎలా చేసేది. ట్రాక్టర్ల నుంచి విగ్రహాలను కల్వర్టునుంచి వేసే సమయంలో ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారు.

● నిర్వహణ నిధులు రాలేదు

- టి సునీత, ఎంపీడీవో, హుజూరాబాద్



గణేష్ నిమజ్జనానికి సంబంధించిన ప్రత్యేక నిర్వహణ నిధులు రాలేదు. నిర్వహణ గురించి ఉన్నతాధికారులకు తెలి యజేస్తాము. వారి ఆదేశానుసారం చర్యలు చేపడుతాం. గణేష్ నిమజ్జనానికి లైటింగ్ సదుపాయం లాంటివి ఉంటే గ్రామపంచాయతీల తరుపున ఏర్పాట్లు అయ్యేలా చూస్తాం.

యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ

రామడుగు, సెప్టెంబరు 15: మండలంలోని గోపాల్‌రావుపేటలోని ఎయిర్‌టెల్ టవర్ దగ్గర కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు విద్యుత్ శాఖాధికారులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి సరఫరాను పునరుద్ధరించారు. రెండు రోజుల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ ఓవర్ లోడుతో విద్యుత్తు సరఫరా రాత్రి నిలిచిపోయింది.

దీంతో గ్రామంలో ఓ ప్రాంతమంతా విద్యుత్ లేక ఇబ్బందులు గురయ్యారు. స్థానిక ఏఈ కమలేశ్వర్ ఆధ్వర్యంలో సిబ్బంది 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ తెప్పించి పదిమంది సిబ్బందితో కలిసి మరమ్మతు చేపట్టారు. అర్ధరాత్రి దాటిన తర్వాత పనులు పూర్తి చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

ఘనంగా కుంకుమ పూజ, అన్నదాన కార్యక్రమాలు

రామడుగు, సెప్టెంబర్ 15: మండలంలో వినాయక నవరాత్రోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద కుంకుమ పూజలు, అన్నదాన కార్యక్రమాలను భక్తులు నిర్వహించారు. తమను చల్లగా చూడాలని కోరుకున్నారు. అలాగే అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. రామడుగు గోపాల్‌రావుపేట, గుండి, వెదిరా, వెలిశాల, దేశరాజపల్లితో పాటు అన్ని గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి



హుజూరాబాద్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

హుజూరాబాద్, సెప్టెంబరు 15: పట్టణంలోని గణేష్ నిమజ్జనానికి మున్సిపాలిటీ పాలక వర్గం ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. తొమ్మిది రోజులుగా పూజలందుకున్న గణనాథుడు సోమవారం నిమజ్జనం చేయనున్నారు. ఇందుకోసం అధికారులు, పోలీసులు అన్ని సౌకర్యాలు కల్పించారు. సాయంత్రం నాలుగు గంటల నుంచే వినాయక నిమజ్జనం ప్రారంభించాలని గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులకు పోలీసులు సూచించారు. హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద గణేష్ నిమజ్జన ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సమ కమిటీ సభ్యులకు సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నారు. హుజూరాబాద్ పట్టణ శివారులోని కరీంనగర్ రోడ్‌లోని ఎస్సారెస్పీ డీబీఎం-16 వద్ద నిమజ్జనం కోసం భారీ క్రేన్‌ను ఏర్పాటు చేశారు. పట్టణంలో ప్రతి వినాయకుడి వెంట ఒక పోలీస్ అధికారిని నియమించారు. ఏసీపీ శ్రీనివాస్‌జీ, ఆర్డీవో రమేష్‌బాబు, తహసీల్దార్ కనకయ్య, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య ఆధ్వర్యంలో టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్, పులి వెంకట్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎస్ఐ యూనస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

మానకొండూర్: మానకొండూర్‌లోని స్థానిక పెద్ద చెరువులో ఈ నెల 16న జరిగే గణేష్ నిమజ్జనానికి అధికారులు అదివారం పూర్తి ఏర్పాట్లు చేశారు. చెరువు కట్టపై రెండు బారీ క్రేన్‌లు, క్రీడామైదానం వద్ద రెండు చిన్న క్రేనులు ఏర్పాటు చేశారు. చెరువు కట్టకు ఇరువైపులా బారీకేడ్లు, విద్యుత్, టెంట్ సౌకర్యం ఏర్పాటు చేశారు. చెరువులో గజ ఈతగాళ్లు, అగ్నిమాపక సిబ్బంది, మున్సిపల్ నిమజ్జన కార్యక్రమంలో విధులు నిర్వహిస్తారు. ఇద్దరు ఏసీపీలు ముగ్గురు సీఐలు, ముగ్గురు ఎస్ఐలతో పాటు మొత్తం 100 మంది పోలీసులు, 50 మంది వలంటీర్లను సిద్ధం చేసినట్లు పోలీసులు తెలిపారు. పెద్ద విగ్రహాలను పెద్ద క్రేనులలో, చిన్న విగ్రహాలను చిన్న క్రేనుల ద్వారా నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు చేశారు.

నీతి మాలిన రాజకీయాలు మానుకోవాలి

-మాజీ మంత్రి కొప్పుల

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 15: కాంగ్రెస్ పార్టీ నాయకులు నీతిమాలిన రాజకీయాలను మానుకోవాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఒక ప్రకటనలో అన్నారు. గత రెండు, మూడు రోజుల నుంచి జరుగుతున్న రాష్ట్ర రాజకీయాలను చూసినట్లయితే వారి వాస్తవ రూపం తెలుస్తోందని ఎద్దేవా చేశారు. అరికెపూడి గాంధీ, కౌశిక్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలని వారి వ్యక్తిగత విబేధాలు మాకేం సంబంధం లేదని సీఎం, మంత్రులు మాట్లాడుతున్నారని అన్నారు. అరికెపూడి గాంధీ స్వయంగా సీఎం చేతుల మీదుగా కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకొని తానే మాట్లాడుతూ మా కార్యకర్తలను, నాయకులను సంప్రదించాకనే కాంగ్రెస్ పార్టీలో చేరానని అనడం రాష్ట్ర ప్రజలంతా చూశారని అన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకొని అరికెపూడి గాంధీ నేను బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అని బుకాయిస్తున్నాడన్నారు. ఒక పదవి కోసం గాంధీ ఇంత దిగజారుడు రాజకీయం చేయడం అవసరమా అంటూ ఈశ్వర్ ప్రశ్నించారు. ఎన్నికల ముందు అమలుకు నోచుకోని అబద్ధాలు చెప్పి ప్రజలను మోసం చేశారన్నారు. ఇప్పుడు మళ్ళీ అబద్ధాలు మాట్లాడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

మాజీ ఎమ్మెల్సీ నారదాసు జన్మదిన వేడుకలు

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 15: బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మన్‌రావు జన్మదిన వేడుకలను పార్టీశ్రేణులు నిర్వహించారు. ఆదివారం నారదాసు లక్ష్మన్‌రావు నివాసంలో మాజీ ఎంపీ వినోద్‌కుమార్ ఆయనచే కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ నారదాసు లక్ష్మన్‌రావు నిండునూరేళ్ళు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో జక్కుల నాగరాజు యాదవ్, సంపత్‌గౌడ్, రేణుక, రోజా, సువర్ణ, శోభ, నయిమ్, లింగరావు, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మిక సంక్షేమ సంఘం మండల కమిటీ

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 15: కరంనగర్ ఆటో కార్మిక సంక్షేమ సంఘం, జెఎసి హడ్‌హాక్ కమిటీ ఆధ్వర్యంలో అధ్యక్షుడు మద్దెల రాజేందర్ సమక్షంలో కరీంనగర్ రూరల్ మండల కమిటి, మండల జేఎసి కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షునిగా కందుల సంపత్, ఉపాధ్యక్షుడు అనారి రమేష్, కారంగుల సందీప్, ప్రధాన కార్యదర్శి కొత్తకొండ సుభాష్, సహాయ కార్యదర్శి రాచమల్ల తిరుపతి, మూల శ్రీనివాస్, కోశాధికారిగా బుర్ర సంజీవ్, ప్రచార కార్యదర్శి బుచ్చాల కొమురయ్య, కరీంనగర్ మండల జెఏసీ కమిటీ సభ్యులుగా దాడి సంపత్, చిట్యాల సతీష్, అనుమల శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ ఆటో యూనియన్ జెఏసి చైర్మన్ మద్దెల రాజేందర్, సభ్యులు మద్దుల రాంగోపాల్ రెడ్డి, నాగుల మహేందర్, కొత్తూరి సత్యనారాయణ, చామనపల్లి ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షుడు యండి ముస్తక్ అహ్మద్, గ్రామాల అధ్యక్షులు ఆటో డ్రైవర్‌లు పాల్గొన్నారు.

మిత్ర యూత్ సభ్యులకు సన్మానం

సుభాష్‌నగర్, సెప్టెంబరు 15: మట్టి గణపతిని ఏర్పాటు చేసి నవరాత్రి వేడుకలను నిర్వహించిన మిత్ర యూత్ సభ్యులను హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సన్మానించారు. స్థానిక రాంనగర్‌లో మిత్ర యూత్ ఆధ్వర్యంలో 30 అడుగుల మట్టి గణపతిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హమ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ధనపురి సాగర్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడేందుకు మిత్రయూత్ సభ్యులు చేస్తున్న కార్యక్రమాలు ఆదర్శనీయమన్నారు.

ఈ కార్యక్రమంలో కొండకింది వేణుగోపాల్‌శర్మ, కంద రవికుమార్, మిత్రమండలి, అఖిల్, నిఖిల్, సాయి తదితరులు పాల్గొన్నారు.

నియామకం

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 15: పీఆర్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కరీంనగర్‌కు చెందిన స్కూల్ అసిస్టెంట్ మండల ఆనందంను నియమించారు. ఈమేరకు ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉమాకర్‌రెడ్డి, సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు.

గౌడ సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్‌గౌడ్

శంకరపట్నం, సెప్టెంబరు 15: మండలంలోని కరీంపేట గ్రామ గౌడ సంఘం అధ్యక్షుడిగా గుర్రం శ్రీనివాస్‌గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం కరీంపేటలోని పోచమ్మ దేవాలయం వద్ద గౌడ సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా శ్రీనివాస్‌గౌడ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో తిరుపతి, ప్రభాకర్, ఆంజనేయులు, శ్రీనివాస్, కొంరయ్య, వీరస్వామి, వీరమల్లు, రవి, సాగర్, విష్ణు, చందు, పవన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు వొడితెల రాజేశ్వర్‌రావు జయంతి

హుజూరాబాద్, సెప్టెంబరు 15: పట్టణంలోని సైదాపూర్ క్రాస్ రోడ్ వద్ద మాజీ ఎంపీ స్వర్గీయ వొడితెల రాజేశ్వర్‌రావు జయంతి వేడుకలను సోమవారం నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వొడితెల రాజేశ్వర్‌రావు, ప్రణవ్ అభిమానులు, నాయకులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. పీసీసీ మెంబర్ పత్తి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సీపీఐలో చేరిన మాజీ సర్పంచ్

చిగురుమామిడి, సెప్టంబరు 15: మండలంలో ఓగులాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కోమటిరెడ్డి జైపాల్‌రెడ్డి అదివారం సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంటకరెడ్డి ఆధ్వర్యంలో సీపీఐలో చేరారు. గునుకులపల్లిలో జరిగిన కార్యక్రమంలో పార్టీ కండువా కప్పి సీపీఐలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అయనను పలువురు నాయకులు సన్మానించినారు.

ప్రశాంత వాతావరణంలో వినాయక నిమజ్జనం చేయాలి

వీణవంక, సెప్టెంబరు 15: మండలంలో ప్రశాంత వాతావరణంలో వినాయక నిమజ్జన కార్యక్రమం చేపట్టాలని జమ్మికుటం రూరల్ సీఐ కె కిషోర్ సూచించారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో గణేష్ విగ్రహాల ఊరేగింపు సమయంలో నిమజ్జన సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలను వినాయక మండలపాల నిర్వాహకులు, డీజే యజమానులతో సమావేశం నిర్వహించారు. ఊరేగింపు సమయంలో శాంతి భద్రతలకు భంగం కలగకుండా నడుచుకోవాలని సూచించారు. చెక్ డ్యాంల వద్ద, చెరువుల వద్దకు నిమజ్జన సమయంలో చిన్నపిల్లలను తీసుకుపోవద్దని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ తోట తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.

డీజేలకు అనుమతి లేదు

గంగాధర, సెప్టెంబరు 15: వినాయక నిమజ్జన కార్యక్రమంలో డీజేలకు అనుమతి లేదని ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. గట్టుబూత్కూర్‌లో ఆదివారం నిర్వహించిన కమ్యూనిటీ పోలీసింగ్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వినాయక నిమజ్జనం సందర్భంగా శాంతి భద్రతలకు ఆటంకం కలిగించకుండా సజావుగా నిమజ్జన కార్యక్రమాలు జరుపుకోవాలని సూచించారు. డీజేలకు అనుమతి లేదని నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.